
# అమెరి'కులాసా' కథలు
## – వంగూరి చిట్టెన్‌రాజు





# -59-
## ఇంటి దొంగల కథ

క్రిందటి నెల మా మా సుపుత్రుడు ఒక ఇంటివాడు అయ్యాడు...అంటే మాకు చెప్పాపెట్టకుండా పెళ్ళీ పెటాకులూ చేసుకో లేదు కానీ, మాకు చెప్పి, మా సహాయం తోటే ఆస్టిన్ నగరంలో ఇల్లు కొనుక్కున్నాడు. కావడానికి అది గంతకు బొంత లాగా ఆ బ్రహ్మచారికి కావలసిన 3 పడక గదులూ, విశాలమైన హాలూ, ఇతర హంగులూ ఉన్న చిన్న ఇల్లే. ఆ వయసులోనే, బ్రహ్మచారిగానే ఉన్నప్పుడే నేను కూడా ఇంచుమించు అదే సైజు ఇల్లు హ్యూస్టన్ లో కొనుక్కున్నాను కానీ నాకూ, వాడి తేడా అల్లా...ఒక సున్నా మాత్రమే. అప్పుడు ఆ ఇంటికి నాకు 55,000 డాలర్లు అయితే ఇప్పుడు వీడు దానికి ఒక సున్నా చేర్చాడు....అంటే ఈ ఇంటి ఖరీదు 550,000 డాలర్లు. ఇంటి సైజులూ ఇంచుమించు ఒకటే..."అప్పు చేయనిదే కొంప కొనుట ఎట్లు" అనే సూత్రం అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడూ ఉండనే ఉంది. ఈ ప్రహసనం గురించి కొంచెం ముఖ పుస్తకంలో వ్రాశాను కానీ అంతకన్నా ముఖ్యమైన విషయాలు ఇక్కడ వ్రాస్తున్నాను.

అసలు సొంత ఇల్లు కొనుక్కోవాలన్న ఆలోచన మా వాడికి ఎందుకు వచ్చిందీ అంటే ఆస్టిన్ నగరానికి కేలిఫోర్నియా నుంచి ఎన్నో టెక్నాలజీ కంపెనీలు, టెస్లా అనే ఎలెక్ట్రిక్ కార్ల తయారీ కంపెనీ మొదలైనవి ఆస్టిన్ తరలి రావడంతో డిమాండ్ పెరగడం, కొత్త ఇళ్ళు కట్టడానికి కోవిడ్ వలన సరుకులు సరిగ్గా అందక పోవడం వలన ఇళ్ళ ఖరీదులు నెల తిరిగే సరికి పెరిగిపోవడం మొదలెట్టాయి. అసలు ఎలాంటి ఇల్లు, ఎంత ఖరీదులో, నగరంలో ఏ శివారులో కొనుక్కోగలమో అనే ప్రహసనం మూడు నెలల క్రితం మా వాడు మొదలు పెట్టాడు. నేనూ, క్వీన్ విక్టోరియా కూడా రెండు, మూడు సార్లు ఆస్టిన్ వెళ్ళి ఐదారు సబ్ డివిజన్లు చూసి వచ్చాం. డిసెంబర్ లో ఒకసారి ఆస్టిన్ విమానాశ్రయానికి దగ్గర మేనర్ అనే శివారులో 2000 వేల ఎకరాలలో 'విస్పర్ వేలీ' అనే కొత్త సబ్ డివిజన్ కి వెళ్ళినప్పుడు అక్కడ మోడెల్ ఇళ్ళలో ఒకటి మాకు భలే నచ్చింది. ఆ బిల్డర్ వాళ్ళ సేల్స్ మన్ నా వయసు వాడే...పేరు బాబ్. అతణ్ణి "మా బాబుకి కొత్త ఇల్లు కావాలి" అని అడిగితే ఆ దొరబాబ్ ఒక కాగితం ముక్క చేతిలో పెట్టి "ప్రస్తుతం ఏమీ అమ్మకానికి లేవు. ఈ అప్లికేషన్ పూర్తి చేసి, 5 వేల డాలర్లకి చెక్కు ఇస్తే, వైటింగ్ లిస్ట్ లో పెడతాం. మళ్ళీ కొత్త ఫేజ్ లో ఇల్లు కట్టడాలు మొదలయినప్పుడు ప్రతీ ఇంటి స్థలాన్నీ, ఇంటి

మోడెల్ నీ వేలం పాట వేస్తాం.  మీరు పాడుకుని, నెగ్గితే అప్పుడు చూద్దాం, ఇదంతా ఆన్–లైన్ లోనే. మీరు మళ్ళీ మీ మొహం నాకు చూపించక్కర లేదు. వెళ్ళండి. కనీసం ఆర్నెల్లు పడుతుంది." అని వెళ్ళిపోయాడు. అయితే మా బాబు ఆ దొర బాబ్ ని అప్పుడప్పుడు వెళ్ళి పలకరిస్తూ, బేస్ బాల్, ఫుట్ బాల్ గురించి మాట్లాడుతూ "టచ్" లో ఉన్నాడు.  ఒక రోజు అకస్మాత్తుగా ఆ దొర బాబ్ మా సుపుత్రుడికి ఫోన్ చేసి" నీకూ, మీ బాబుకీ, ఆ చీరావిడకీ....అంటే క్వీన్ విక్టోరియా అనమాట....అందరికీ నచ్చిన ఆ మోడెల్ హోమ్ ఇవాళ సాయంత్రం మార్కెట్ లో అమ్మకానికి పెడుతున్నాం. దానికోసం చాలా మంది కాసుకుని కూచున్నారు. రెండు నెలల క్రితం మీరు చూసినప్పుడు ఆ ఇల్లు 490,000 డాలర్లు కదా. ఇప్పుడు కేవలం 550,000. నువ్వు కొనుక్కుంటానూ అంటే ఒక గంటా, రెండు గంటల్లో వచ్చి ఐదు వేలు కడితే అది మార్కెట్ లోకి వెళ్ళకుండా నేను చూసుకుంటాను." అని లోగుట్టు పెరుమాళ్ళకి ఎరుక చేశాడు. మధ్యాహ్నం దున్నపోతులా పడుకున్న నన్ను మా వాడు ఫోన్ చేసి, నిద్ర లేపి "వాట్ టు డూ?" అని అడగ్గానే ఆ మత్తులో "కొనెయ్" అని అటు తిరిగి పడుకున్నాను.

ఆ ఇంట్లో మాకు నచ్చిన అంశం..ఇంటి కరెంటు,  ఎయిర్ కండిషనింగ్, హీటింగ్ వగైరాలు అన్నీ అంతా సౌర విద్యుత్తుతోనే...అంటే సోలార్ పవర్. రిఫ్రిజిరేటర్, గిన్నెలు కడుగు యంత్రమూ, గడ్డికి నీళ్ళు పెట్టు స్ప్రింక్లర్లూ అన్నీ ఇంటి తోటే వస్తాయి. వాడి దగ్గర ఉన్నవి కాక, మా వాడు కొనుక్కోవలసినవి అల్లా కొన్ని పరుపులు, సోఫాలు, బట్టలు ఉతుక్కునే యంత్రమూ లాంటివే. ఇక ఆదరా బాదరాగా మా బాబు ఆ దొరబాబ్ దగ్గరకి అప్పటికప్పుడే వెళ్ళి ఇల్లు కొనుక్కోడానికి ఎడ్వాన్స్ కట్టి, ఒప్పందం మీద సంతకాలు పెట్టాడు. అన్నింటి లోగీ వాడికి నచ్చినది సొంత బట్టలు ఉతికే వాషర్ డ్రైయర్ కొనుక్కోడం. ఎందుకంటే "వెధవ మాసిన బట్టలన్నీ కారులో వేసుకుని వాటిని ఉతుక్కోడానికి ప్రతీ రెండేసి వారాలకీ ఆస్టిన్ నుంచి హ్యూస్టన్ రావక్కర లేదు కదా!".  అని ట...

ఇది మోడెల్ ఇల్లు కాబట్టి, అదే ఆ దొర బాబ్ గాడి ఆఫీసు కాబట్టి చిన్న ఇబ్బంది కాని ఇబ్బంది వచ్చింది. ఎందుకంటే ఇంటికి అనుకుని ఉన్న కార్లు పెట్టుకునే గరాజ్ ని వాళ్ళు ఎయిర్ కండిషనింగ్ వగైరా అన్ని హంగులతో ఆఫీసు గదిగా మార్చేశారు. ఇప్పుడు దాన్ని మళ్ళీ గరాజ్ లాగా మార్చాలి..ట. అలాగే ఇంటికి ముందు అందంగా ఉన్న మొక్కలూ, వాళ్ళ పేరు ఉన్న పెద్ద సిమెంట్ సైన్ బోర్డూ కూడా తీసేసి ఆ గరాజ్ లోకి కార్లు వెళ్ళేలా డ్రైవ్ వే వెయ్యాలి..ట. టెక్సస్ బిల్డింగ్ కోడ్ ప్రకారం అవన్నీ చెయ్యడానికి ఒక  నెల పడుతుంది..ట. అప్పుడు కానీ ఇంటి అమ్మకం పూర్తి చేసి..అంటే "క్లోజింగ్" అనే ప్రక్రియ అయ్యాక ఇల్లు స్వాధీనం చేస్తారు ట....ఈ అన్నీ షరతులకీ ఒప్పుకుని మా వాడు సంతకాలు పెట్టాక, దొరబాబ్ తో సహా మేము కొనుకున్న ఇంటికి వెళ్ళాం, అక్కడ బాబ్ గాడు "మీకు ఒక రహస్యం చెప్పనా? అని మైకులో ఓ సంగతి చెప్పాడు. "ఆ గరాజ్ ఆఫీసుని మళ్ళీ కార్లు పెట్టుకోడానికి వీలుగా చెయ్యడానికి ముందున్న ఈ పూల మొక్కలతో సహా ఈ మంచి మొక్కలన్నింటినీ మా వాళ్ళు బూల్ డోజర్ తో తీసి గార్బేజ్ లో పారేస్తారు. ఇల్లు అనధికారంగా మీదే

కాబట్టి ఆ మొక్కలు మీరే జాగ్రత్తగా పెరికి ఇంటి వెనకాల స్థలంలో పాతుకో వచ్చును.. ఇక్కడ "Sold" అనే బోర్డ్ పెడతాను కాబట్టి ఎవరూ రారు. నేను ఈ మాట మీకు చెప్పినట్టు ఎవరికీ చెప్పకండి." అని కన్ను కొట్టాడు దొర బాబ్. దాంతో ఆలోచనలో పడ్డాం. ఆ మంచి మొక్కలు అలాగే వదిలేస్తే ఏ క్షణాన్న అయినా ఆ బుల్ డోజర్ క్రిందపడి చచ్చిపోతాయి. అంచేత మనమే బాబ్ గాడు చెప్పినట్టు వాటిని పీకి ఆ ఇంటి వెనకాల పాతాలీ అంటే మెక్సికన్ భూమి పుత్రుడు చెయ్యాలి తప్ప మన వల్ల కాదు. అప్పుడు క్వీన్ విక్టోరియా అమోఘమైన సలహా ఇచ్చింది. "మళ్ళీ ఎవడో ఎందుకూ?మన ఫెర్నాండెజ్ నే అడుగు. హ్యూస్టన్ నుంచి వచ్చి ఈ పని చెయ్యడానికి ఎంత తీసుకుంటాడో అడుగు." ఈ ఫెర్నాండెజ్ అనే వాడు గత పదేళ్ల నుంచీ హ్యూస్టన్ లో మా గాడి పీకుడూ, మొక్కలి నాటుడూ బగైరా పనులు చేస్తే మెక్సికన్ వీరుడు. వెంటనే నేను "వావ్, బ్రిలియంట్, ప్రేయసీ" అనేసి ఫోన్ లో ఫెర్నాండెజ్ ని పిలుస్తూండగా "అంతే కాదు, ఈ మొక్కలన్నీ ఇక్కడ వెనకాల పట్టవు. ఆ బిళ్ళ గన్నేరు మొక్కలలో సగం, ఆ అందంగా ఉన్న ఐదారు పొదలూ హ్యూస్టన్ లో మనింటీ వెనకాల తోటలో పాతాలి అని కూడా చెప్పు" అని మరో బ్రిలియంట్ అవిడియా విసిరింది ఆ మహా తల్లి. వెంటనే అవన్నీ ఫోటోలు తీసి, ఫెర్నాండెజ్ కి పంపించి, మొత్తం మీద ఎంత పని ఉంటుందో ఇద్దరం కలిసి ఒక అంచనా వేసి, వాడు ఎప్పుడు రాగలడో ముహూర్తం పెట్టేశాం. "పని అయ్యాక ఎంతో చెప్తాను, రాయూ" అన్నాడు...రాయూ అనేది వాడి స్పానిష్ భాషలో నా పేరు.

ఇక్కడ మా అమెరికన్ సుపుత్రుడు ఒక పెద్ద ప్రశ్న వేశాడు."నాన్నా, మనం ఇంకా ఇల్లు కొనకుండానే, ఇక్కడి మొక్కలు 150 మైళ్ళ దూరంలో ఉన్న  హ్యూస్టన్ పట్టుకుపోతే అది "దొంగతనం" అవుతుంది కదా!" నువ్వూ, నేనూ మాట ఎలా ఉన్నా అమ్మ కూడా జైలుకి వెళ్ళడం బావుండదేమో కదా""?" అదీ వాడి ప్రశ్న సారాంశం. దాంతో మా సామూహిక బుర్ర గోకుడు కార్యక్రమం ప్రారంభం అయింది. మా కాబోయే ఇంట్లోంచి చావబోయే మొక్కలని రక్షించడం దొంగతనమా? మేము  ఘరానా దొంగలమా లేక పర్యావరణ రక్షకులైన మొక్కల సంరక్షకులమా? మొత్తానికి నానా తర్జనా, భర్జనా పడీ, బాబ్ గాడితో రహస్య మంతనాలు జరిపి, ఫెర్నాండెజ్ హామీ కూడా తీసుకుని, మహా అయితే ఇది "ఇంటి దొంగతనం" క్రింద వస్తుందిలే, దానికి శిక్ష తక్కువే అనేసుకుని, సద్ది చెప్పుకుని ఆ మొక్కలని రక్షించాం. అంచనా వేస్తే అలా సుమారు 200 బిళ్ళ గన్నేరులు, ఆరు అందంగా కత్తిరించబడిన పొదలు, పదికి పైగా మామూలు పొదలు, పది గులాబీలు, పది చిన్న రంగుల మొక్కలు బూల్ డోజర్ "భజియించ" కుండా రక్షించ బడ్డాయి. సరిగ్గా మరొక వారం తర్వాత అనుకున్నట్టుగానే ఎవడో కాంట్రాక్టర్ రావడం, రెండు రోజుల్లో  ఆ గరాజ్ ఆఫీసుని గరాజ్ గా చేసెయ్యడం, ముందు మేము మిగిల్చిన మొక్కలు లేని బోసి ప్రాంతాన్ని చదును చేసి, సిమెంట్ డ్రైవ్ వే వెయ్యడం జరిగిపోయింది. అన్నీ అయ్యాక, ఇల్లు కొనుగోలు పూర్తి అవడం, మా అమెరికన్ సంతానం "దట్ మిల్క్ థింగ్" అనే "పాలు పొంగించి" గృహ

ప్రవేశం చెయ్యడం అన్నీ జరిగాయి. ఆ"దొంగ మొక్కలు" కొన్ని చలికి ఊసురోమంటూ ఉన్నా, చాలా మటుకు మా ఇంట్లో హాయిగా ఊపిరి పీల్చుకుంటున్నాయి. రాబోయే వసంత ఋతువులో మరింతగా వికసిస్తాయి.





మేము మా ఇంటి 'దొంగతనం' చెయ్యక ముందు ఎలా ఉండేదో, ఆ తర్వాత ఇప్పుడు ఎలా ఉందో తెలియడం కోసం ఆ రెండు ఫోటోలూ ఇక్కడ పెట్టాను....మీ కోసం. ఇప్పుడు పోలీస్ రిపోర్ట్ ఇవ్వడం వలన ఉపయోగం లేదు కదా!.అదీ నా ధైర్యం. ఇప్పుడు కొత్త మొక్కలు కొని ఇంటి ముందు మళ్ళీ అందంగా తీర్చిదిద్దే కార్యక్రమం మరో వారం పది రోజులలో ఈ శీతాకాలం వెళ్ళగానే మొదలవుతుంది...

**COMMENTS**